


# ది బ్రేక్

ఆ రోజు ఆదివారం. మధ్యాహ్నం 12 గంటలయ్యేసరికి యింటిల్లిపాది టి. వి చుట్టూ చతికిలపడ్డారు. ఎన్నాళ్ళకెన్నాళ్ళకి తెలుగు ప్రోగ్రాం-అదీ యీ మధ్యనే ఎవార్డ్సు సంపాదించిన తెలుగుచలనచిత్రం టెలికాస్ట్!

ఉదయమంతా వంట వార్పు చేసి అలసిపోయిన శ్రీమతి "హమ్మయ్య యిప్పటికి తెమిలింది పనికాస్తా!" అనుకుంటూ ఈజీ చైర్‌లో నడుం చేరవేసింది.

"డాడీ ఈ పిక్చర్‌ని మీరేనా సెన్సార్ చేశారు? ఎలా వుంటుంది డాడీ"- మా పెద్దమ్మాయి ఆత్రుత.

"ఆ! మన గొల్డీల చిత్రాల గురించి వేరే చెప్పాలా! తప్పకుండా రైడింగ్ మూవీయే-" మా ఆఖరి అమ్మాయి అభిప్రాయం.

"నువ్వేమైనా చెప్పు హిందీ చిత్రాలు చూస్తే కలిగే థ్రిల్ తెలుగు సినిమాలు చూస్తే చస్తే కలగదు"- మా చెల్లెలి యీసడింపు! (అమితాబ్ పంకా లెండి).

"కలర్ టి. వి. వచ్చి రెండు సంవత్సరాలైంది. నే నెంత గీ పెట్టినా కొనలేదు. ఇప్పుడు విచారించి ఏం ప్రయోజనం. ఈ సినిమా చూస్తే కలర్ టి.వి. లోనే చూడాలి. నేను నా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళి వాళ్ళ యింపోర్టెడ్ కలర్ టి. వి. లో జాలీగా చూస్తాను. మీరంతా యీ డొక్కు పెట్టుని విడవకండి" అంటూ రుసరుసలాడుతూ ఫ్రెండ్ ఇంటికి పరుగెత్తింది మా రెండో అమ్మాయి.

చలనచిత్రం ప్రారంభమయింది. సెన్సార్ సర్టిఫికెట్ చూపించారు. కట్టయింది స్క్రీన్ మీద 'సారీ ఫర్ ది బ్రేక్' అయిదు నిమిషాలు కన్పించింది. పంపిణీదారుల పేర్లు చూపిస్తున్నారు — యింట్లో కరెంట్ పోయింది. క్రిందవాళ్ళ యింట్లో. ప్రక్కవాళ్ళ యింట్లో — చుట్టుపక్కలంతా కరెంట్ పోయింది. మా పెద్దమ్మాయి ఎమ్. యి. ఎస్. కి ఫోన్ చేసే కేబిల్ ఫాల్ట్— రెస్టోర్ చెయ్యడానికి కనీసం రెండు గంటలైనా అవుతుందన్నారట. అందరికీ ఏడుపొచ్చినంత పనైంది. సినిమా మాట దేముడెరుగు. పంకా లేకపోతే నిద్ర పట్టదే. శ్రీమతి ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ వాళ్ళకి శాపనార్థాలు పెడుతోంది. తెలుగు భాషాభిమానిలెండి.

ఎలాగైతేనేం గంటన్నర గడిచింది. కరెంట్ వచ్చింది. హమ్మయ్య అనుకున్నాం. ఒక్క నిమిషం పిక్చర్ చూశామో లేదో టి.వి. స్క్రీన్ బ్లాంక్ అయిపోయింది. పదిహేను నిమిషాల తరువాత స్క్రీన్ మీద తాటికాయంత అక్షరాలు "సారీ ఫర్ ది బ్రేక్ డ్యూటు పవర్ ఫెయిల్యూర్" కనిపించాయి. అరగంటయింది. సినిమా ప్రారంభమయింది. రెండు నిమిషాలుచూశామో లేదో ఇంట్లోమళ్ళీ కరెంటు పోయింది. కరెంటు వచ్చిందని టి.వి. స్క్రీన్‌వేపు చూస్తే "శుభం" అన్న అక్షరాలు కనబడ్డాయి.

—ఒ. ఆర్. కె. రావు

దిగాలుగా నవ్వింది నిశ్చల.

"ఈ పూట అవియల్ వండించు. తినాలని వుంది!"

"డెఫినెట్లీ అండ్ పర్‌ఫెక్ట్లీ"

నిశ్చలకి మనసు కుదుటపడాలంటే సంగీతం వినడం ఓ దారి. మనసు బాగాలేనప్పుడు వినడం కోసం కొన్ని పాటలు ప్రత్యేకంగా రికార్డ్ చేసుకుంది. వాటిలో ఒకటి మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడిన భక్తిగీతం "ఏమీ సేతురా లింగా"

అది విందామని టేప్ రికార్డ్‌లో కేసెట్ వుంచబోయింది. "ప్లే" బటన్ నొక్కి వుండటం గమనించింది. దాంతో పాటు రికార్డ్ బటన్ కూడా నొక్కి వుంది.

"స్టాప్" నొక్కి కేసెట్‌ని అమరుస్తూ ఆలోచించింది, ఈ మధ్య తనేం రికార్డ్ చేసిందా అని.

సాగర సంగమం కేసెట్‌లోని పాటలు రికార్డ్ చేయాలని వాగ్దేవి నించి దాన్ని తెచ్చిన సంగతి గుర్తుకొచ్చింది. కాని తను రికార్డ్ చేసుకోలేదే?

ఎందుకు చేసుకోలేదు?

ఆ సమయంలో దేడి రావడంవల్ల తను యాదాలాపంగా ఈ రెండు బటన్స్ నొక్కిందా?

అవును!

అంటే....!అంటే....?

"ఓ గాడ్."

లేచి కళ్యాణ్, వాగ్దేవిల గదికి వెళ్ళింది. కళ్యాణ్ ఇంకా నిద్ర లేవలేదు.

"గుడ్ మార్నింగ్" చెప్పి భర్తని నిద్రలేపబోయింది వాగ్దేవి.

"వద్దు." వారించి కేసెట్స్ వుంచే డెక్ దగ్గరికి నడిచింది. ఒకో కేసెట్‌ని పరీక్షగా చూసి 'సాగర సంగమం' కేసెట్ కోసం వెదికింది. లేదు.

ఏం కావాలి?" అడిగింది వాగ్దేవి.

"ఏం లేదు."

వెనక్కి తిరిగిన నిశ్చలకి ఆ కేసెట్ ఎక్కడుందో తెలియలేదు. గుమ్మందాకా వచ్చాక ఆ ప్రశ్నకి సమాధానం స్ఫురించింది. గుమ్మం పక్కన తాళంచెవి ఆకారంలో వున్న కీ హేంగర్‌కి వేలాడుతున్న కారు తాళంచెవుల గుత్తిని చూడగానే. దాన్నందుకుని చెప్పింది.

"ఓ అరగంటలో ఇచ్చేస్తాను."

వాగ్దేవి భర్తని లేపి జరిగింది చెప్పింది.

"కారు తాళంచెవులు తీసుకెళ్ళిందన్నావు. నిశ్చల కారు పాడయిందా?" బద్ధకంగా అడిగాడు.

"ఏమో?"

నిద్రమత్తు ఇంకా వదలకపోవడంవల్ల మళ్ళీ నిద్రలోకి జారిపోయ్యాడు.ఉదయం తొమ్మిదీ అయిదుకి ట్రాన్సిస్టర్‌లోంచి వచ్చే పాట ట్యూన్‌ని వింటూ దాంతోపాటు ఈలవేస్తూ టక్ చేసుకుంటున్న కళ్యాణ్ నోట్లోని ఈల అకస్మాత్తుగా ఆగిపోయింది.

"మువ్వా గోపాలుడే.... ముద్దు గోపాలుడే....!" సాగర సంగమంలోని పాట అది! నిశ్చల తన కారు తాళంచెవులు తీసుకెళ్ళింది.

మెరుపులా కిందకి పరిగెత్తాడు.కారు తలుపు తెరచి కారులో బిగించివున్న టేప్ రికార్డర్ ప్లే బటన్ నొక్కాడు.

నిశ్చల, గంగాధరం సంభాషణలు పొరపాటున రికార్డు అయిన సాగర సంగమం పాటల కేసెట్ అందులో లేదు!!!

(ఇంకా వుంది)